

# మానసమయూరి

## – కస్తూరి మురళీకృష్ణ



*(గత సంచిక తరువాయి)*

**ఆరోజు ఆఫీసులో** అంతా అన్యమనస్కంగా గడిచింది.

ఎన్నోమార్లు శిల్పకు ఫోను చేయాలనుకున్నాడు. కానీ నెంబరు కలిపిన తరువాత చాలాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాడు. 'సెండ్' కీ నొక్కకుండా వదిలేశాడు.

'కాస్సేపటికి శిల్పనే చేయవచ్చు కదా' అనుకున్నాడు.

ఆమె చేస్తుందేమోనని ఎదురు చూశాడు.

కానీ ఆమె చేయలేదు.

ఎందుకనో అతడికి అన్నీ శిల్పతో చెప్తేకానీ మనశ్శాంతి వుండదనిపిస్తోంది. తన ఆందోళనలు, సందిగ్ధాలన్నిటికీ సమాధానం ఆమె దగ్గర లభిస్తుందనిపిస్తోంది.

'అదొక బలహీనత' అనుకుని సర్దిచెప్పుకోవాలని ప్రయత్నించాడు.

ఈ ప్రపంచంలో మనిషి ఒంటరిగానే వస్తాడు. ఒంటరిగానే వెళ్తాడు. ఈ మధ్యలో ఎవరిదో తోడు కావాలని, ఓ భుజం ఆసరా కావాలని ఆశించటం మానవ మనస్సు బలహీనత తప్ప మరొకటి కాదు.

ఎవరి బాధ మరొకరు పడలేరు. ఎవరి బాధను వాళ్ళే అనుభవించాలి.

కానీ తనకి ఎందుకు బాధ?

స్రవంతిని ఆ అబ్బాయితో చూసినప్పటి నుంచీ శరత్ మనస్సు మనస్సులో లేదు.

ఏం చేయగలడు తాను?

రోడ్డుపైన చూస్తూనే వున్నాడు. ఏదైనా కాలేజీ వుందంటే బయట అబ్బాయిలు అమ్మాయిలు గుంపులు గుంపులుగా మాట్లాడుతూ కనిపిస్తారు.

ఈ గుంపుల్లో తన కూతురు కూడా ఒకర్తె.

నదిలో అడుగుపెట్టి కాలికి తడి అంటకూడదనటం కుదురుతుందా?

తాను పుట్టినప్పటి నుంచీ చూస్తూనే వున్నాడు, యవ్వనంలో తొందరపడటం, జీవితాంతం ఆ ఫలితాన్ని అనుభవిస్తూండటం. సగం సినిమాలు అలాంటివే.

అవి చూస్తూ కూడా ఎలా తప్పు చేస్తారు మనుషులు?

బహుశా తప్పు చేసేటప్పుడు అది తప్పు అనిపించదేమో? అయినా తాను తప్పు అందరూ శిక్షను అనుభవిస్తారనిపిస్తుందేమో? ఆ క్షణంలో ప్రపంచం అదృశ్యమైపోతుందేమో.

అంతలో అతనికి ఎంతో నచ్చిన లతా పాట గుర్తుకు వచ్చింది.

*ఉమ్మీదోంకె హసీన్ మేలే, తమన్నా వోంకె వోరేలే.*
*నిగాహోనే నిగా హోంసే అజబ్ కుఛ్ ఖేల్ థే ఖేలే*
*హవా మే జుల్ఫ్ లహరాయి, నజర్ పే బేఖుదీ ఛాయి*
*ఖులేథే దిల్కె దర్వాజే, మొహబ్బత్ భీ ఛలీ ఆయీ*
*తమన్నా హోంకీ దునియా పర్ జవానీ చాగయీ*
*వొ భూలీ దాస్తాన్, లోఫిర్ యాద్ ఆగయీ*
*నజర్‌కే సామ్‌నే ఘటాసీ ఛాగయీ!*

కోరికల అందమైన జాతరలు, ఆశల పల్లకీలు కళ్ళు. కళ్ళతో చిత్రమైన ఆటను ఆడాయి. గాలికి ఎగిరిన ముంగురులు కళ్ళపై మైకం కమ్మింది. హృదయపు ద్వారాలు తెరుచుకున్నాయి. ప్రేమ వచ్చింది. కోరికల ప్రపంచంపై యవ్వనం రాజ్యం చేసింది. ఎంత అందంగా వర్ణించాడు యవ్వనంలోని ప్రేమను.

*'తమన్నా వోంకే దునియాపర్ జవానీ చాగయీ '*

వ్యక్తిగతంగా ఎన్నెన్ని ఆశలు, కోరికలు, ఆశయాలు వున్నా యవ్వనం ముందు అన్నీ దిగదుడుపే. అందుకే స్త్రీ పురుషులు ఆ క్షణంలో అన్నీ మరిచిపోతారు. అదొక మైకం. అదొక వున్మాదం. జలపాత ధారలో వుండే దూకుడు. తెగింపు, ధైర్యం, ఉత్సాహాలు... కానీ ఆవేశం తగ్గి నిజానిజాలు గ్రహింపుకు వచ్చేసరికి, వెనక్కు తిరిగి చూసుకుంటే

*కహాసే ఫిర్ చలీ ఆయే, యె కుఛ్ భట్కేహువే సాయె*
*యె కుఛ్ భూలే హువే నగ్మే, జో మేరీ ప్యార్‌నే గాయే*
*యె కుఛ్ బిఛ్‌డీ హులీ యాదే, యె కుఛ్ టూటే హువీ సప్నే*
*పరాయే హోగయ్‌తో క్యా, కభీ యేభీతోథే అప్నే*
*నజానే ఇన్‌సె క్యూ మిల్‌కర్, నజర్ షర్మాగయీ!*

ఎక్కడినుంచి వచ్చాయో దారితప్పి ఈ జ్ఞాపకాలు, నా ప్రేమ పాడిన ఈ పాటలు, జ్ఞాపకాలు, పగిలిన స్వప్నాలు.. ఇవన్నీ ఇప్పుడూ పరాయి అయి వేరైనా ఒకప్పుడు నావే. కానీ ఈనాడు వీటిని చూస్తూంటే సిగ్గుతో నా కళ్ళు దించుకోవాల్సి వస్తోంది ఎందుకు? - శరత్ మనస్సు బాధతో మెలిపెట్టినట్టయింది.

అతడి కళ్ళముందు అమాయకమైన కూతురి ముఖం కనిపించింది. ఎవడినో ప్రేమించటం యవ్వనంలో, ఆ ప్రేమ సఫలం కాకపోవటం, తరువాత ఇంకెవడినో పెళ్ళి చేసుకోవటం, తాను సుఖపడలేకపోవటం, చేసుకున్నవాడిని సుఖపెట్టలేకపోవటం... జీవితాంతం అదేదో బాధతో, ఏదో కోల్పోయినట్టు భావిస్తూ దుఃఖిస్తూ సుఖం శాంతి లేక జీవితం గడుపుతుందా తన కూతురు?

*బడే రంగీన్ జమానే థే, తరానే హీ తరానే థే*
*మగర్ అబ్ పూఛ్‌తాహై దిల్, వో దిన్ థే యా ఫసానాథే*
*ఫకత్ ఎక్ యాద్ హై బాకీ, బస్ ఎక్ ఫర్యాద్ హై బాకీ,*
*వొఖుషియా లుట్ గయీ లేకిన్, దిల్ ఎ బర్బాద్ హై బాకీ*

### కహాఁథే జిందగీ మేరీ, కహా పర్ ఆగయా!

నిజం, ప్రేమ సాగుతున్నంత కాలం ప్రపంచం అందంగా వుంటుది. ప్రతిక్షణం గీతంలా సాగుతుంది. కానీ వెనుతిరిగి చూసుకుంటే అవి నిజంగా అనుభవించానా? లేక కలా? అనిపిస్తుంది. ఇప్పుడు మిగిలింది జ్ఞాపకమే. 'అయ్యో' అని మొరపెట్టుకోవటం మిగిలి వుంటుంది. అప్పటి ఆనందాలు అదృశ్యమైపోతాయి. కానీ పగిలిన వేదనా భరితమైన హృదయం మిగిలి వుంటుంది. ఎలాంటి జీవితం, ఎలా అయిపోయింది. అని బాధ పడటం తప్ప మిగిలిందేమీ లేదు.

ఈ ఆలోచనలన్నీ చేదుగా అనిపించాయి.

చుట్టూ చూశాడు.

సహ ఉద్యోగులందరూ ఆనందంగా ఏదో చర్చించుకుంటున్నారు. కొందరు సీరియస్‌గా పని చేసుకుంటున్నారు.

వీళ్ళల్లో చాలామందికి కాలేజీల్లో చదివే కూతుళ్ళున్నారు.

వీళ్ళంతా ఇంత ప్రశాంతంగా ఎలా వుండగలుగుతున్నారు?

తానెందుకు వీళ్ళలా హాయిగా వుండలేకపోతున్నాడు?

తన కూతురు ఓ యువకుడితో మాట్లాడుతూ కనిపించింది. దానికి తాను ఇంతగా ఆలోచించాలా. ఏదో ఘోరం జరిగిపోయినట్టు ఊహించేసుకుని ఆనందాన్ని కోల్పోవాలా? ఆలూ లేదు చూలూ లేదు అన్నట్టుంది తన పరిస్థితి. తనకి తాను సర్ది చెప్పుకున్నాడు.

తన దృష్టి పనివైపుకు మళ్ళించాడు. కానీ వుండుండి ఏదో ఆలోచన అతడిని బాధిస్తునే వుంది.

ఎప్పుడూ లేనిది ఇలా అడుగుతున్న తండ్రి వైపు విస్మయంగా చూసింది స్రవంతి.

'నేను, సరిత కంబైన్డ్ స్టడీ చేస్తున్నాం నాన్నా అందుకని వెళ్తునాను వాళ్ళ ఇంటికి' అంది సమాధానంగా

శరత్ మాట్లాడలేదు. మౌనంగా బయటకు నడిచాడు.

'ఎటు వెళ్తున్నారు?' వెనకే వచ్చి అడిగింది ప్రశాంతి. ఇంటికి వచ్చిన తరువాత ఎంతో అర్జంటు పని వుంటే తప్ప బయటకు కదలడు శరత్. అలాంటిది అతడు బయటకు వెళ్ళటం ఆశ్చర్యం అనిపించింది ప్రశాంతికి.

'ఇప్పుడే వస్తాను. సందు చివరవరకే' అన్నాడు శరత్ బయటకు నడుస్తూ అతడికి తాను చేయబోతున్న పని అసహ్యంగా వుంది. తనని తానే తిట్టుకుంటున్నాడు. కానీ విషయం తెలుసుకుంటే కానీ అతడికి మనశ్శాంతి లభించేట్టు లేదు.

తన స్వంత కూతురిపై గూఢచార పని చేస్తున్నాడు శరత్.

కాసేపటికి స్రవంతి బయటకు వచ్చింది. బ్యాగు భుజానికి వ్రేలాడుతోంది. నెమ్మదిగా నడుస్తోంది.

ఆమె సందు తిరగటం చూసి తాను సమాంతరంగా సందు తిరిగాడు శరత్.

అతడికి ఓ వైపు అసహ్యంగా అనిపిస్తోంది తాను చేస్తున్నపని. కానీ తన అనుమానం తీరాలంటే అది తప్ప మరో పనిలేదు. అందుకనే తనని తాను తిట్టుకుంటూ, అసహ్యించుకుంటూ ఆమెని వెంబడిస్తున్నాడు.

బస్టాపు దగ్గరకు వచ్చింది స్రవంతి.

సరిత ఇంటికి బస్సు ఎక్కనవసరం లేదు.

శరత్ మనస్సులో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. తుఫాను గాలులు వీస్తున్నాయి.

తెలియని విషయం మనిషిని బాధించదు. బాధించే విషయం తెలుసుకోవాలని లేదు.

తన కూతురు తనతో అబద్ధం చెప్పిందా?

ఇన్నిరోజులూ కంబైన్డ్ స్టడీస్ అని చెప్తున్నది అబద్ధమా?

ఇంతలో స్రవంతి స్నేహితురాలు సరిత బస్టాపుకు వచ్చింది.

'ఇద్దరూ కలిసి మరో ఫ్రెండింట్లో కలిసి చదువుతారా?'

వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుతూ నుంచున్నారు.

బస్సు వచ్చింది.

వాళ్ళిద్దరూ బస్సు ఎక్కారు.

బస్సును అనుసరించాలా? వద్దా?

కాస్సేపు తటపటాయించాడు.

దీని అంతేదో తేల్చుకోవాలనుకున్నాడు. బస్సును అనుసరించాడు.

సరిత దగ్గరకు కంబైన్డ్ స్టడీస్ కోసం అంది. సరితను కలిసింది కానీ కంబైన్డ్ స్టడీయా కాదా? అన్నది తెలియదు.

ఆలోచిస్తూ, జాగ్రత్తగా బస్సు వెనకే నడపసాగాడు.

బస్సు ఆగినపుడు దిగేవారిని జాగ్రత్తగా చూస్తూ, బస్సును వెంబడించాడు. బస్టాపులో దిగారిద్దరూ.

బస్టాపుకు అటువైపు వున్న సినిమా థియేటర్‌లోకి దారి తీశారు.

'ఇక్కడా కంబైన్డ్ స్టడీస్?' శరత్ మనస్సు భగ్గుమంది.

సినిమాకి వెళ్తానంటే వద్దని ఎప్పుడూ అనలేదు. డబ్బులిచ్చి మరీ పంపించాడు. ప్రశాంతి తిట్టేది కూడా.

కానీ పిల్లలు సినిమాలు చూడాలని అంటే వద్దంటే దొంగతనంగా చూడటానికి అలవాటు పడతారని తానే వెళ్ళమన్నాడు.

ఎప్పుడు ఏ పని చేసినా అబద్ధాలు చెప్పి, దొంగతనంగా కాదు, ధైర్యంగా చేయాలని చెప్పేవాడు.

అవన్నీ ఏమైపోయాయి?

అక్కడ సినిమా హాలులో ఇంకో నలుగురు స్నేహితురాళ్ళు కలిశారు. అందరూ కలసి దగ్గరలోనే వున్న మెక్‌డొనాల్డ్స్‌లో కూచున్నారు. అంతా అద్దాలుండటంతో బయటకు కనిపిస్తోంది.

కాస్సేపటికి ఒక బైక్ మీద ముగ్గురు చొప్పున ఆరుగురు యువకులు వచ్చారు.

వాళ్ళూ వీళ్ళూ ఒకరినొకరు 'గ్రీట్' చేసుకున్నారు.

అందరూ ఒకే టేబుల్ దగ్గర కూర్చున్నారు.

తాను చూస్తున్నది కలా? నిజమా? అర్థం కావటంలేదు శరత్‌కు. ఇప్పుడేం చేయాలి?

అయినా అసలు ఏం జరిగిందని ఏమైనా చేయాల్సిన అవసరం ఏముంది?

ఈ కాలంలో అందరు యువతీ యువకులు కలిసి తిరుగుతున్నారు.

కలసి పార్టీ చేసుకుంటారు. కలసి తిరుగుతున్నారు.

ఆఫీసులో సైతం పిక్నిక్‌లకు వెళ్తారు. రిసార్టులకు వెళ్తారు.

ఇదంతా కామన్.

కానీ అందరూ వెళ్ళటం వేరు, తన కూతురు అందరిలా వుండటం వేరూనా?

తాను ఎవ్వరితో కలవకుండా వేరుగా, భిన్నంగా వుంటాడు కాబట్టి తన కూతురుకూడా అలాగే వుండాలా?

ఎవరి వ్యక్తిత్వం వారిది. ఎవరి జీవితం వారిది.

ఎంత సర్ది చెప్పుకున్నా సమాధాన పడలేకపోతున్నాడు.

ఇంతలో వారంతా బయటకు వచ్చారు.

అందరూ జంటగా విడిపోయారు. ఇద్దరిద్దరూ కలసి మాట్లాడుతూ నడుస్తున్నారు. థియేటర్‌లోకి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన వైపు చూస్తూ నిలబడ్డాడు శరత్.

కూతురు అబద్ధం చెప్పినందుకు బాధపడాలా? కోపం ప్రదర్శించాలా?

కంబైన్డ్ స్టడీస్ అని సినిమాకు వెళ్ళినందుకు తిట్టాలా?

ఏం చేయాలో తెలియక రోడ్డుమీద అలాగే నిలబడిపోయాడు శరత్.

చుట్టూ వాహనాలు పెద్ద రొదతో పరుగిడుతున్నాయి. కాలం నిశ్శబ్ధంగా పరుగులిడుతోంది.

శరత్ నిశ్శబ్ధంగా, మౌనంగా స్థాణువై నిలబడి వున్నాడు.

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*

Post your comments